# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 329 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 12-1-2025 | వెల : .రూ. 5.00



## విలేకరులు కావలెను


తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.


## ఢిల్లీలో ముక్కోణపు సిరీస్..!

### ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల వేడి

- ఆప్ ప్రతిష్టకు సవాల్ కానున్న ఎన్నికలు
- వరుసగా మూడోసారి విజయంతో హ్యాట్రిక్‌పై కన్ను
- ప్రతిష్టగా తీసుకుని పోరాడుతున్న బీజేపీ




**న్యూఢిల్లీ, జనవరి 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

దేశరాజధానికి అసెంబ్లీగా ఉన్న ఢిల్లీ ఎన్నికలపై పట్టుకోసం బిజెపి ఎత్తులు వేస్తోంది. ఇప్పటి వరకు రెండు ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన ఆప్ మరోమారు గెలుపు ద్వారా హ్యాట్రిక్ కొట్టాలని చూస్తోంది. అయితే ఢిల్లీ లిక్కర్ స్కామ్ సహా అనేకమంది నేతలు అవినీతి కేసుల్లో ఇరుక్కుని జైలుకు వెళ్లడంతో ఆప్ ప్రతిష్ట కొంత మసకబారింది. మరోవైపు ఆప్‌కు చెందిన పలువురు నేతలు పార్టీని వీడారు. ఈ క్రమంలో ఆప్‌కు గతంలో ఉన్న ఛరిష్మా కనబడడం లేదు. అందువల్ల బిజెపి ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఫిబ్రవరిలో జరిగే ఈ ఎన్నికల్లో గెలుపు ఎవరిదన్నది ఆసక్తిగా -మిగతా 2 లో



## పార్టీలో పనిచేసిన వారికే పదవులు

- త్వరలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన
- సంక్రాంతి తరవతా మంత్రివర్గ విస్తరణపై స్పష్టత
- దానం నాగేందర్ వ్యాఖ్యలను పరిశీలిస్తున్నాం
- మీడియా సమావేశంలో టీపీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, జనవరి 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని త్వరలో ప్రకటిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ వెల్లడించారు. నాలుగు పేర్లు పరిశీలనలో ఉన్నాయని, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి పేరు చాలా మంది -మిగతా 2 లో



## మెట్రో రైళ్లు ఫుల్.. బస్టాండ్లు కిటకిట

- సంక్రాంతికి ఊరెళ్లిన పట్నవాసులు
- జాతీయ రహదారులపై వాహనాల బారులు టోల్‌గేట్ల వద్ద గంటలతరబడి క్యూలు
- నగరం నుంచి ప్రత్యామ్నాయా మార్గాల్లో పంపించిన పోలీసులు

**హైదరాబాద్/ జనవరి 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

సంక్రాంతి పండగ సందర్భంగా నగరవాసులు వాహనాల్లో సొంతూళ్లకు క్యూకట్టడంతో.. దాదాపు అన్ని రూట్లలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఏటా ఇదేతంతు కనిపించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

-మిగతా 2 లో



## భూ భారతితో సమస్యలకు చెక్

- కేసీఆర్ ఇష్టానుసారంతో ధరణి సమస్యలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**నల్గొండ,**

ఇందిరమ్మ ఇళ్లలో గిరిజనులకు అధిక ప్రాధాన్యం ఇస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తన గెలుపులో గిరిజనుల పాత్ర అధికంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పది శాతం రిజర్వేషన్లు అమల్లోకి రావడంలో తన కృషి కూడా ఉందని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి తండాలో గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేశ చరిత్రలో -మిగతా 2 లో

## పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలి

- నెలాఖరులోగా కొత్త ఉస్మానియా నిర్మాణానికి శంకుస్థాపన
- పలు నమూనాలు పరిశీలించిన సీఎం
- ఉస్మానియాపై అధికారులతో సమీక్ష
- కార్పోరేట్‌కు దీటుగా ఉండాలని రేవంత్ ఆదేశం
- ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సీఎం



**హైదరాబాద్, జనవరి 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఈ నెలాఖరులోగా కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంపై శనివారం తన నివాసంలో ముఖ్యమంత్రి -మిగతా 2 లో



## టెట్ పరీక్షలో గందరగోళం


- సర్వర్ డౌన్‌తో 150మంది పరీక్షకు దూరం

**హైదరాబాద్,**

తెలంగాణలో నిర్వహిస్తోన్న టెట్ పరీక్షలో గందరగోళం నెలకొంది. శంషాబాద్‌లోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన టెట్ పరీక్షా కేంద్రంలో గందరగోళం చోటు చేసుకుంది. రెండో సెషన్‌లో మధ్యాహ్నం 2గంటలకు మొత్తం -మిగతా 2 లో

## రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ విప్లవం

- కాలుష్య రహిత వాతావరణం ఏర్పాటు
- గ్రీన్ ఎనర్జీ ద్వారా రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు
- హరిత ఇంధన ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్
- మీడియాతో ఇష్టాగోష్టిలో చంద్రబాబు నాయుడు



**అమరావతి, జనవరి 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ విప్లవం రానుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విద్యుత్ రంగలో ఇదో విప్లవానికి నాంది కానుందని అన్నారు. రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు గ్రీన్ ఎనర్జీ రూపంలో రానున్నాయని తెలిపారు. అనకాపల్లి జిల్లా పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ -మిగతా 2 లో



## తెలంగాణలో సంవిధాన్ బచావో కార్యక్రమం

-27న హాజరుకానున్న రాహుల్, ఖర్గే

**హైదరాబాద్,**

కాంగ్రెస్ అగ్రనేతలు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఈనెల 27న తెలంగాణ పర్యటనకు రానున్నారని కాంగ్రెస్ హైకమాండ్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. -మిగతా 2 లో

# ఢిల్లీలో ముక్కోణపు సిరీస్..!

(మొదటి తరువాయి)

మారింది. ఇప్పుడు ఎక్కడ చూసినా ప్రధానంగా ఢిల్లీ ఎన్నికలపైనే చర్చ నడుస్తోంది.. ఎందుకంటే దేశానికి రాజధానిగా ఉన్న ఢిల్లీలో ఏ పార్టీలో అధికారంలోకి వస్తుందోనని అంచనాలు వేసుకుంటున్నారు. అయితే ఢిల్లీలో ఎవరు గెలుస్తారో అటుంచితో అసలు ఢిల్లీ ఎన్నికలు ఎప్పుడు మొదలయ్యాయి.. మొదటిసారిగా ఎవరు అధికారంలోకి వస్తారు అనే విషయాలపై ఒక్కసారి వెనుక్కు వెళదాం.. ఢిల్లీ లెజిస్టేటీవ్ అసెంబ్లీ మొదటిసారిగా మార్చి 7 1952న పార్ట్ సీ కింద ఏర్పాటైంది. దీనిని హోంమంత్రి కట్టూ ప్రారంభించారు. అసెంబ్లీలో అప్పుడు 48 మంది సభ్యులు ఉన్నారు. ఢిల్లీ ప్రధాన కమిషనర్‌కు సలహాదారు పాత్రలో మంత్రుల మండలి ఉంది. అయినప్పటికీ చట్టాలు చేసే అధికారాలు కూడా దీనికి ఉన్నాయి. మొదటి మంత్రి మండలికి చౌదరి బ్రహ్మప్రకాష్ నాయకత్వం వహించారు. ఆయన ఢిల్లీకి మొదటి ముఖ్యమంత్రి కూడా. అయితే 1953 రాష్ట్రాల పునర్వవస్థీకరణ కమిషన్, రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం 1956 ద్వారా రాజ్యాంగ సవరణకు దారితీసింది. ఇది నవంబర్ 1 1956 నుంచి ఆమలులోకి వచ్చింది. దీని అర్థం ఢిల్లీ ఇకపై పార్ట్ సీ రాష్ట్రం కాకుండా యూనియన్‌గా మార్చబడింది. భారత రాష్ట్రపతి ప్రత్యక్ష పరిపాలనలో పాలించబడింది. దీంతో అప్పటి వరకు ఉన్న శాసన సభ, మంత్రి మండలి కూడా ఒక్కసారిగా రద్దయ్యాయి. తదనంతరం ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ చట్టం 1957 అమల్లోకి వచ్చింది. అలాగే 1966లో ఢిల్లీ మెట్రోపాలిటన్ కౌన్సిల్ 56 మంది ఎన్నికై, ఐదుగురు నామినేట్ చేయబడిన సభ్యులుతో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌ను అధిపతిగా నియమించారు. అయితే కౌన్సిలుకు శాసన అధికారాలు మాత్రం లేకుండాపోయాయి. ఇలా 1990 వరకు కొనసాగుతూ వచ్చింది. మళ్లీ 1993 సంవత్సరంలో ఢిల్లీ 70 శాసన సభా శాసన సభ ఏర్పాటైంది. అయితే 1993 నుంచి 2008 జరిగిన నాలుగుసార్ల ఎన్నికల్లో ప్రజలు ఏకపక్ష తీర్పునిచ్చారు. ఒకసారి బీజేపీకి ఇస్తే, మిగిలిన మూడుసార్లు కాంగ్రెస్సుకు ఇచ్చారు. మొట్టమొదటిసారిగా 2013లో జరిగిన ఎన్నికల్లో హంగు వచ్చింది. ఇందులో బీజేకీ 32 సీట్లు వచ్చి అతిపెద్ద పార్టీగా అవతరించింది. అప్పటికి పార్టీ స్థాపించి ఒక ఏడాది మాత్రమే అయిన ఆమ్‌ఆద్మీ పార్టీ ఎన్నికల్లో పోటీ చేసి 28 స్థానాలను కైవశం చేసుకుంది. కేవలం 8 సీట్లకే పరిమితమైన కాంగ్రెస్ ఆప్ పార్టీకి మద్దతు ఇవ్వటంతో ఆప్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే అవినీతి నిరోధక ఎజెండాపై అదికారాన్ని జేజిక్కించుకున్న ఆప్ పారీఅవినీతిని దర్యాప్తు చేయటానికి స్వతంత్ర సంస్థను రూపొందించటానికి జన్‌లోక్‌పాల్ బిల్లును ఆమోదించటానికి ముందుకొచ్చింది. కానీ దాని పదవీకాలం రెండు నెలలలోపే ఉండటంతో ఆప్ జాతీయ కన్వీనర్, మొదటిసారి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ లోక్‌పాల్ బిల్లును ఆమోదించడంలో విఫలమయ్యారు. దీంతో ఆయన రాజీనామా చేయడంతో మళ్లీ రాష్ట్రపతి పాలనలోకి వెళ్లింది. అయితే 2015 ఢిల్లీ ఎన్నికల్లో ఏకపక్ష ఫలితాలు వచ్చాయి. ఆప్ పార్టీ అఖండ విజయంతో తిరిగి అధికారంలోకి వచ్చింది. అసెంబ్లీలో సీట్లలో 67 సీట్లు మరియు అత్యదికంగా 54.34 ఓట్ల శాతం సాధించింది. బీజేపీ మూడు స్థానాలు రాగా కాంగ్రెస్ ఖాతా తెరవకుండాపోయింది. అధికారంలోకి వచ్చిన ఆప్‌పార్టీ మహిళలకు ఉచిత నీరు, విద్యుత్, ప్రజా రవాణా సహా అనేక సంక్షేమ పథకాలు అమలుతో ఆప్ పార్టీ 2020 మరోసారి భారీ మెజార్టీ విజయం సాధించింది. అయితే 2025 కంటే కొంచెం తక్కువగా 62 సీట్లు మాత్రమే వచ్చి 53.57 శాతం ఓట్ల శాతానికి సాధించింది. బీజేపీకి 8 స్థానాలు రాగా ఓట్లు శాతం 38.51 శాతానికి పెంచుకుంది. కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో కూడా ఖాతా తెరవకుండాపోయింది. అయితే 2025 ఫిబ్రవరిలో జరిగే ఎన్నికల్లో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనేది వీడని చిక్కుముడిగా మిగిలిపోయింది.

# రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ విప్లవం

(మొదటి తరువాయి)

తయారవుతుందని అన్నారు. మిగిలిన ప్రాంతాల్లో తయారయ్యే సౌర, పవన, పనీపడ్ స్టోరేజ్ విద్యుత్‌ను పూడిమాడకకు తెస్తే వాటి ద్వారా హైడ్రోజన్ ఉత్పత్తి అవుతుందని చెప్పారు. ఉత్పత్తయ్యే హైడ్రోజన్‌తో ఎరువులు, రసాయనాలు తయారవుతాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మీడియాతో ఇష్టాగోష్టి సందర్భంగా హరిత ఇంధనం ద్వారా తయారయ్యే వీటికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని దీంతో ఎగుమతులు పెరిగి మనకు లాభం వస్తుందని చెప్పారు. అల్యూమినియం, ఉక్కు ఉత్పత్తికి హైడ్రోజన్ వాడితే వేడి బాగా తగ్గుతుందని తెలిపారు. ఎన్టీపీసీలో బొగ్గు మండించటం ద్వారా వచ్చే కార్బన్ డైయాక్సైడ్‌ని పూడిమడక తెచ్చి హైడ్రోజన్ ఉత్పత్తికి వాడితే కాలుష్యం తగ్గుతుందన్నారు. గ్రీన్ కో కంపెనీ కాకినాడలో నాగార్జున ఫెర్టిలైజర్స్‌ను టెకోవర్ చేసి గ్రీన్ ఆమోనియా తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తారని చెప్పారు. ఈ ఎ÷-లాంట్ మీద రూ.25వేలకోట్ల పెట్టుబడులు పెడుతున్నారన్నారు. కాకినాడ పోర్టు ద్వారా ఎగుమతులు జరుగుతాయని చెప్పారు. రిలయన్స్ కంపెనీ బయో కంప్రెస్సెడ్ గ్యాస్ తయారీకి 500కేంద్రాలు పెడుతోందని వివరించారు. ఒక్కో కేంద్రం రూ.130కోట్ల పెట్టుబడి పెడుతున్నారని చెప్పారు. బయోగ్యాస్‌కు ఉపయోగపడే గడ్డి ద్వారా ఇది తయారవుతుందని తెలిపారు. ఈ గడ్డి పెంచటానికి ఎకరాకు రూ.30వేల కౌలు రైతులకు రిలయన్స్ చెల్లిస్తుందన్నారు. ఈ కేంద్రాల వల్ల ఉద్యోగాలు వచ్చి, గ్యాస్ ఉత్పత్తిలో వచ్చే వ్యర్థాలు భూసారం పెంచేందుకు ఎరువు గానూ ఉపయోగపడుతుందని చెప్పారు. బెంగుళూరుకు చెందిన ఓ సంస్థ స్వాపింగ్ బ్యాటరీలు మోడల్‌ను కుప్పంకి తెచ్చిందన్నారు. కుప్పంలో సూర్యఘర్ అమల్లో ఉన్న ఇళ్లకు స్వాపింగ్ బ్యాటరీలు ఛార్జింగ్ చేసుకునేందుకు ఇంటి యజమానికి డబ్బులు చెల్లిస్తుందని అన్నారు. ఇది కుప్పం సూర్యఘర్ ఇంటి వాసులకు అదనపు ఆదాయం కానుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'ఈ కేంద్రాల వల్ల ఉద్యోగాలు వచ్చి, గ్యాస్ ఉత్పత్తిలో వచ్చే వ్యర్థాలు భూసారం పెంచేందుకు ఎరువు గానూ ఉపయోగపడుతుంది. బెంగుళూరుకు చెందిన ఓ సంస్థ స్వాపింగ్ బ్యాటరీలు మోడల్‌ని కుప్పంకి తెచ్చింది. కుప్పంలో సూర్యఘర్ అమల్లో ఉన్న ఇళ్లకు స్వాపింగ్ బ్యాటరీలు ఛార్జింగ్ చేసుకునేందుకు ఇంటి యజమానికి డబ్బులు చెల్లిస్తుంది. ఇది కుప్పం సూర్యఘర్ ఇంటి వాసులకు అదనపు ఆదాయం కానుంది.

# పార్టీలో పనిచేసిన వారికే పదవులు

(మొదటి తరువాయి)

చెప్పారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్రపక్షాలకు మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యలను పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. అందరి రిపోర్టు కేసీ వేణుగోపాల్ వద్ద ఉందన్నారు. పార్టీ నేతలందరూ వచ్చే 20 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని గట్టిగా హెచ్చరించారని చెప్పారు. ఈ నెలాఖరుకు పార్టీలో అన్ని కమిటీలు వేస్తామని, పనిచేసిన వారందరికీ పదవులు ఇస్తామని స్పష్టం చేశారు. పనిచేసిన నాయకులకే పదవులు వస్తాయన్నారు. కార్పొరేషన్ పదవుల భర్తీ ఈ నెలాఖరుకి పూర్తవుతుందని తెలిపారు.తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక కామెంట్స్ చేశారు. మంత్రి వర్గ ఎప్పుడు ఉంటోందో తేల్చిచెప్పారు. అలాగే కాంగ్రెస్‌లో చేరికలు కూడా జోరుగా ఉంటాయన్నారు. గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు సంబంధించి ప్రకటన ఉంటుందని తెలిపారు. సంక్రాంతి తర్వాత మంత్రివర్గ విస్తరణ చేస్తామని ప్రకటించారు. అలాగే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు చేస్తున్నామని.. సంకాంత్రి తర్వాత చేరికలు ఉంటాయని వెల్లడించారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్ర పక్షాలకు మద్దతు ఇస్తామన్నారన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నాలుగు పేర్లు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, ప్రసన్న హరికృష్ణ, మాజీ అధికారి గంగాధర్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు వెల్లడించారు.కాగా.. గత కొద్దినెలలుగా తెలంగాణ కేబినెట్ విస్తరణపై జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది డిసెంబర్‌లోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని అంతా భావించారు. ఈ మేరకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి వెళ్లి హైకమాండ్ పెద్దలతో చర్చలు కూడా జరిపారు. డిసెంబర్‌లోనే మంత్రి వర్గ విస్తరణ ఖాయమని అప్పట్లో మంత్రులు కూడా ప్రకటనలు చేశారు. యితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో ఉండగా.. ఈ నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌కు వెళ్లనున్నారు. ఈ క్రమంలో రేవంత్ పర్యటన నేపథ్యంలో కేబినెట్ విస్తరణ మరింత ఆలస్యం కానుందని కాంగ్రెస్ వర్గాలే చెప్పుకొచ్చారు. ఇప్పుడు అనూహ్యంగా టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ స్వయంగా మంత్రి వర్గ విస్తరణపై ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది.

# మెట్రో రైళ్లు ఫుల్..బస్టాండ్లు కిటకిట

(మొదటి తరువాయి)

దీనికితోడు విజయవాడ రహదారిలో రిపేర్లు కూడా వాహనదారులకు పరీక్ష పెట్టాయి. పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్డెక్కడంతో ఆయా ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. శనివారం నుంచి సెలవులు ప్రారంభం కావడంతో ఇటు విజయవాడ, అటు వరంగ్ల, ఇటు నిజామాబాద్రూట్లలో రద్దీ పెరిగింది. సొంత కార్లలో బయలుదేరిన వారికి ట్రాఫక్ జామ్ చీకాకు తెప్పించింది. టోల్‌గేట్ల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరుతున్నాయి. దీంతో టోల్‌గేట్ల వద్ద రద్దీ లేకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వాహనాలను దారి మళ్లించారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆధ్వర్యంలో పండగ రద్దీ నివారణకు చర్యలు తీసుకున్నారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో హైదరాబాద్ నగరవాసులు స్వగ్రామాలకు బయలుదేరారు. వరుస సెలవులు ఉండటంతో సొంతూళ్లకు తరలివెళ్లారు. మరోవైపు పండగకు వెళ్లే వారితో మెట్రో రైళ్లలో రద్దీ నెలకొంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎల్బీనగర్, మియాపూర్, సికింద్రాబాద్, ఎంజీబీఎస్, జేబీఎస్ తదితర ప్రాంతాలకు చేరుకునేందుకు మెట్రో రైళ్లలో ప్రయాణిస్తున్నారు. మియాపూర్, రాయదుర్గం, జేఎన్టీయూ, అమీర్‌పేట్, ఎంజీబీఎస్, పరేడ్ గ్రౌండ్స్, సికింద్రాబాద్, ఎల్బీనగర్, ఉప్పల్ తదితర స్టేషన్ల వద్ద రద్దీ నెలకొంది. సంక్రాంతి సెలవులు వచ్చాయంటే చాలు సొంతూళ్లకు పయనమవుతారు. ఈ క్రమంలో.. హైదరాబాద్-విజయవాడ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. హైదరాబాద్ నుంచి పల్లెలకు వాహనాలు బారులు తీరాయి. ప్రతీసారి ఉన్నట్లే భారీ వాహనాల రద్దీతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుంది. సంక్రాంతి సందర్భంగా సొంత ఊర్లకు పయనమైన వాహనాలతో టోల్ ప్లాజాల దగ్గర వాహనాల రద్దీ కొనసాగుతోంది. గత రాత్రి నుంచి ఇప్పటివరకు కూడా టోల్ గేట్స్ దగ్గర వాహనాల తాకిడి భారీగా ఉంది. జగ్గయ్యపేట దగ్గర చిలకల్లు, నందిగామ దగ్గర కీసర, గన్నవరం దగ్గర పొట్టిపాడు చెక్ పోస్టుల దగ్గర వాహనాల రద్దీ నెలకొంది. దీంతో సాధారణ రోజుల కంటే ఎక్కువ గేట్లను అందుబాటులో తెచ్చి వాహనాలను అనుమతి పంపిస్తున్నారు. రోజుకి సాధారణ రోజుల్లో 15 వేల వాహనాలు టోల్ గేట్ల నుంచి బయటకు వెళ్తుండగా.. ఇప్పుడు పండగ సీజన్ కావటంతో వాటి సంఖ్య 40,000 వరకు ఉంటుందని టోల్ గేట్ సిబ్బంది చెబుతున్నారు. వివిధ మార్గాల నుంచి వస్తున్న వాహనాలతో విజయవాడ నగరంలో ఫుల్ ట్రాఫిక్ జామ్ అవుతుంది.. ఇతర ప్రాంతాల నుంచి విజయవాడ వైపుకు వస్తున్న వాహనాలతో నగరంలోని ప్రధాన రహదారులు కిక్కిరిసి పోతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో రోడ్డుపై రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోతున్నాయి. వారధి వైపు నుంచి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, ఉభయ గోదావరి జిల్లాల వాహనాలు నగరంలోకి వస్తున్నాయి. అదే విధంగా హైదరాబాద్ హైవే నుంచి నగరంలోకి వచ్చి ఉభయ గోదావరి, విశాఖ వైపుకు భారీగా వాహనాలు తరలి వెళ్తున్నాయి.

# పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలి

(మొదటి తరువాయి)

రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోషామహల్ లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసు కున్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వైద్యఆరోగ్య శాఖకు వీలైనంత త్వరగా బదిలీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూ బదలాయింపు పక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాప్ లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అధికారులు సూచించిన మ్యాప్ లలో పలు మార్పులు, చేర్పులను సూచించారు. అన్ని రకాల ఆధునిక వసతులతో ఉండేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలన్నారు సీఎం. రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాలను రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ, ప్లై ఓవర్ లాంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలన్నారు. అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్క్ లాంటి సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాలు, ఇతర నమూనాలకు సంబంధించి పూర్తిస్థాయి డిజైన్లను రూపొందించాలన్నారు. ఈ నెలాఖరులోగా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భగా గోషామహల్ లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించి శాఖల మధ్య భూ బదలాయింపు పక్రియ, ఇతర పనులను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన ఉస్మానియా ఆసుపత్రి, ఇతర నిర్మాణాలకు సంబంధించి నమూనా మ్యాప్ లను సీఎంకు వివరించిన అధికారులు. పలు మార్పులు, చేర్పులను రేవంత్ రెడ్డి సూచించారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సీఎం.. ప్రతి ఒక్కరూ ఊరెల్లి నలుగురితో కలవాలి.. ఇక, రాబోయే 50 ఏళ్ల కాలానికి గాను అవసరాలను అంచనా వేసి కొత్త ఆసుపత్రిని నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆసుపత్రికి నలువైపులా రహదారులు ఉండేలని చూడాలన్నారు. చికిత్స కోసం అన్ని జిల్లాల నుంచి ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా కనెక్టివిటీ రోడ్లను డెవలప్ చేయాలని సూచించారు. రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాలను రూపొందించాలన్నారు. ఈ నెలాఖరులోగా ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

# భూ భారతితో సమస్యలకు చెక్

(మొదటి తరువాయి)

ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా భూ భారతి చట్టం రూపుదిద్దుకుంటుదన్నారు. భూ భారతిని గవర్నర్ కూడా ఆమోదించారని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం ఇష్టారీతిన ధరణి అమలు చేసిందని.. కనీస నిబంధనలు కూడా లేకుండా ధరణి అమలు చేశారని తెలిపారు. ఫిబ్రవరి 15 లోగా భూ భారతి రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి వస్తుందని అన్నారు. 2029లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని.. తెలంగాణలో కూడా కాంగ్రెస్ అధికారం లోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు కూడా ఆర్థిక సాయం ఇవ్వడం గొప్ప విషయమని చెప్పారు. అందరికీ తెల్ల రేషన్ కార్డులు అందిస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 కిలోల సన్న బియ్యం ఇస్తుందని ప్రకటించారు. రాజకీయంగా కూడా అందరికీ సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. అటవీ హక్కుల ప్రకారం మిగిలిన గిరిజనులకు భూములు ఇస్తామని మాటిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అందరం కలసి పనిచేయాలని అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఒడిదుడుకుల కారణంగా ఒకటి రెండు హామీల అమలు ఆలస్యం అయిందని అన్నారు.

# టెట్ పరీక్షలో గందరగోళం

(మొదటి తరువాయి)

750 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 467 మంది హాజరయ్యారు. సర్వర్ డౌన్ కారణంగా 150 మంది అభ్యర్థులకు టెట్ పరీక్ష నిలిచిపోయింది. దీంతో పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థుల కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. అభ్యర్థులకు మద్దతుగా వారి కుటుంబ సభ్యులు శంషాబాద్- షాబాద్ రహదారిపై బైఠాయించారు.

## తెలంగాణలో సంవిధాన్ బచావో కార్యక్రమం

(మొదటి తరువాయి)

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి కావడంతో ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ నిర్ణయించింది. ఈ సందర్భంగా తెలంగాణలో జరగనున్న 'సంవిధాన్ బచావో' ప్రదర్శనలో వారు పాల్గొనబోతున్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇటీవల జరిగిన సమావేశంలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరసనలు వ్యక్తం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా, జనవరి 26, 2024 నుంచి జనవరి 26, 2026 వరకు దేశవ్యాప్తంగా 'సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్ర'ను చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ యాత్రను విజయవంతం చేయడానికి అన్ని స్థాయిల కాంగ్రెస్ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. మహేశ్‌కుమార్ గౌడ్ మంగళవారం పార్టీ శ్రేణులకు రాసిన లేఖలో, రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ చేస్తున్న కుట్రలను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ చొరవ తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పార్టీ విస్తృత కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ పర్యటనతో తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారు. 'సంవిధాన్ బచావో' ఉద్యమానికి ఈ పర్యటన కీలక మైలురాయిగా నిలుస్తుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొనబోతున్నారు

## తెలుగు పంచాంగం 12/1/2025, ఆదివారం

సమయ సమాచారం
సూర్యోదయం: ఉదయం 6:50
సూర్యాస్తమయం: సాయంత్రం 5:56
తిథి
శుక్ల పక్ష ద్వాదశి
ప్రారంభం: జనవరి 11 ఉదయం 9:50
ముగింపు: జనవరి 12 ఉదయం 11:38
నక్షత్రం
కృత్తిక
ప్రారంభం: జనవరి 11 ఉదయం 6:15
ముగింపు: జనవరి 12 ఉదయం 7:58
శుభ సమయాలు
అమృతకాలం: మధ్యాహ్నం 12:42 నుండి 2:18 వరకు
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:58 నుండి 12:42 వరకు
అశుభ సమయాలు
రాహుకాలం: సాయంత్రం 4:28 నుండి 5:50 వరకు
యమగండం: మధ్యాహ్నం 12:19 నుండి 1:41 వరకు
దుర్ముహూర్తం:
ఉదయం 7:52 నుండి 8:33 వరకు
మధ్యాహ్నం 3:12 నుండి 3:54 వరకు
వర్జ్యం: రాత్రి 3:58 నుండి ఉదయం 5:34 వరకు
పండితుల సూచన
ఆదివారం రోజున సూర్యనారాయణుడి పూజ విశేష ఫలితాలను ఇస్తుందని పండితులు సూచిస్తున్నారు. ఆదిత్య హృదయం పఠనం, గోధూమ దానం, మరియు ముద్రిత ఆహార పదార్థాలు పంచడం వల్ల ఆరోగ్య సమస్యలు దూరమవుతాయి. ఈ రోజు ద్వాదశి పర్వదినం కావడంతో విష్ణు పూజ చేయడం మరియు తిరుమల శ్రీనివాస స్వామిని స్మరణ చేయడం ఎంతో శ్రేయస్కరం. నీరాజనం, సంప్రోక్షణ, దానం చేయడం శుభప్రదంగా ఉంటుంది.

# వృద్ధులకు వికలాంగులకు కొండంత అండ లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్




ఆమనగల్, జనవరి 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
వయో వృద్ధులు, వికలాంగులకు సహాయపడేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ కీలక చర్యలు చేపట్టింది. రామ్ రెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్ చైర్పర్సన్ డాక్టర్ వి. దామోదర్ రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో కల్వకుర్తి మండలం వెంకటాపూర్ గ్రామం మరియు వెంకటాపూర్ తండాలో జిల్లా చైర్మన్ బండెల రామచంద్రా రెడ్డి సమకూర్చిన 200 దుప్పట్లు, రగ్గులను 200 మందికి క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వి. దామోదర్ రెడ్డి మాట్లాడుతూ, చలి తీవ్రత పెరగడంతో చలిని తట్టుకోవడానికి వృద్ధులకు, వికలాంగులకు ఈ రగ్గులు, దుప్పట్లు అందజేసినట్లు తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో చలి విపరీతంగా పెరిగి వృద్ధులకు, వికలాంగులకు ఇబ్బందులు కలగకుండా ఉండాలని, వారి ఆరోగ్యం దృష్ట్యా రగ్గులను అందజేసినట్లు తెలిపారు. సమాజంలో ప్రతి వ్యక్తి వాతావరణాన్ని తట్టుకోగలిగినప్పుడే సీజనల్ వ్యాధులు దరిచేరవని, అందుకోసం ప్రతి ఒక్కరూ దాన గుణం అలవర్చుకోవాలని సూచించారు. దుప్పట్లను సమకూర్చిన జిల్లా చైర్మన్ బండెల రామచంద్రారెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి గుజ్జేరి నరసింహ, జిల్లా చైర్మన్ లయన్ జూలూరి రమేష్, బండెల రామచంద్రారెడ్డి, లయన్ సభ్యులు పసుల నరసింహారెడ్డి, వెంకటపూర్ మరియు వెంకటాపూర్ తాండ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఆకలితో అలమటిస్తున్న వారి ఆకలి తీర్చడమే లయన్స్ క్లబ్ లక్ష్యం




కడ్తాల్, జనవరి 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
తెలంగాణ రాష్ట్రంలో లయన్స్ క్లబ్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిల్స్ అండ్ వీల్స్ కార్యక్రమాన్ని కడ్తాల్ బస్టాండ్ ఆవరణలో కీర్తిశేషులు పి. అనంతరెడ్డి వర్ధంతి సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, మాజీ గవర్నర్, లయన్ జి. చెన్న కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆకలితో అలమటిస్తున్న వారి ఆకలి తీర్చడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని చెప్పారు. సొసైటీలో ఎవరైనా తమ బంధువుల జన్మదిన ఉత్సవాలకు, వివాహ వార్షికోత్సవాలకు, వర్ధంతి కార్యక్రమాలకు మిల్స్ వెహికల్ ఉపయోగించుకోవాలని కోరారు. ఆకలితో ఉన్న వారి ఆకలి తీర్చడం కోసం ఈ కార్యక్రమాన్ని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణికులు, బాటసారులు, గ్రామస్తులు అందరికీ ఉపయోగకరంగా ఉందన్నారు. లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న క్లబ్ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో 400 మందికి అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేసినట్లు లయన్స్ క్లబ్ పి.ఆర్.ఓ పాష తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి దోనదుల మహేష్, క్లబ్ సభ్యులు చేగురు వెంకటేష్, దూదే, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్లు పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



ఆమనగల్లు, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్
స్థానిక ఆమనగల్లు పట్టణంలోని వివేక విద్యా భారతి ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల ప్రాంగణాన్ని పటాలతో అలంకరించి, భోగి మంటలు, రంగవల్లులు, గొబ్బెమ్మలతో సందడి చేశారు. సంక్రాంతి పండుగను పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పండుగ విశేషాలను తెలియజేసారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాపిశెట్టి రాము పండుగ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ అడ్వైజర్ వెంకటేశ్వర శర్మ, కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ మహమూద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## ఆందోళన బాట పట్టిన గోకారం & ఎర్రవెల్లి గ్రామ భూ నిర్వాసితులు



చారకొండ, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా ఎర్రవెల్లి & గోకారం రిజర్వాయర్ భూమి నిర్వాసితులు ఆందోళనలో ఉన్నారు. రిజర్వాయర్ నిర్మాణం నేపథ్యంలో తమ గ్రామాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టవద్దని పలుమార్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ విషయంపై ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడినట్టు గ్రామస్తులు గుర్తు చేశారు. ఇతర విషయాలపై కొద్దిమేర సంతృప్తి సాధించినప్పటికీ, పెండింగులో ఉన్న డబ్బులు అకౌంట్లో జమవడంతో ఆందోళనలో ఉన్న గ్రామస్తులు, ఎర్రవెల్లి & గోకారం గ్రామాలు వదిలిపెట్టకుండా మాకు న్యాయం జరగేవరకు పోరాడతామని తేల్చిచెప్పారు.

## నాగర్ కర్నూల్ ఎస్పీ కీలక సూచనలు



నాగర్ కర్నూల్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రంగనాథ్ గ్రామాల పర్యటన సందర్భంగా పండగ సందర్భంగా గ్రామం విడిచి వెళ్లే ప్రజలకు కీలక సూచనలు చేశారు. విలువైన వస్తువులను బ్యాంకు లాకర్ లో భద్రపరచాలని, ఇంటికి తాళం వేసేటప్పుడు కర్టెన్స్ అడ్డంగా ఉంచాలని, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మన వస్తువులను భద్రంగా ఉంచుకోవచ్చని ఎస్పీ సూచించారు.

## ఘనంగా వడ్డే ఓబన్న 218వ జయంతి వేడుకలు



రంగారెడ్డి, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
: శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న 218వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి కేషరామ్, వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఓబన్న, 1840 సంవత్సరంలో ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రవేశపెట్టిన భూమి శిస్తు విధానం వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని లేవదీశారు. ఈ ఉద్యమానికి ఓబన్న చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతులను, సంచార జాతుల వారితో సుమారు పదివేల మందిని కూడగట్టి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పేద రైతుల పక్షాన నిలబడి వీరోచిత పోరాటం చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర కుల సంఘం నాయకులు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్ పట్టణ అధ్యక్షుడికి విక్రమ్ రెడ్డి ఘన సత్కారం



ఆమనగల్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఆమనగల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన నూతన అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డికి ఆమనగల్ మున్సిపాలిటీ బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం నాగర్ కర్నూల్ పార్లమెంట్ బీజేవైఎం కో-కన్వీనర్ రవి రాథోడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు సక్రనాయక్, బోద్య, పత్య నాయక్, రమేష్, శీవరాం, కాళ్యాణ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి యువకునికి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సత్కారం



కల్వకుర్తి, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద బృందం అధ్యక్షుడు శివను కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఢిల్లీలో సన్మానించారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా యంగ్ ఇండియా యూత్ వాయిస్ కార్యక్రమంలో ప్రతిభ కనపర్చినందుకు గాను శివ ఈ సత్కారం పొందారు. శివ మాట్లాడుతూ, ఈ అవార్డు తనకు ఎంతో ప్రోత్సాహం కలిగించిందని, భవిష్యత్తులో మరింత ప్రతిభ కనపర్చడానికి ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు.

## ఘనంగా జక్కుల చిన్న జంగయ్య యాదవ్ జన్మదిన వేడుకలు



వెల్దండ, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
: వెల్దండ మండల పరిధిలో జక్కుల చిన్న జంగయ్య యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో శ్రీశైలం, నారాయణ, అలీ భాయ్, రాజు యాదవ్, జక్కుల రామయ్య, కొండలు, శ్రీను, నరేష్, అభిమానులు పాల్గొన్నారు. జక్కుల చిన్న జంగయ్య యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేసి, శాలువతో సన్మానించారు.

## నాగర్ కర్నూల్ జిల్లా బిజెపి కౌన్సిల్ సభ్యులుగా ఆదోజు శ్రీనివాసచారి నియామకం



వెల్దండ, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

వెల్దండ మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామ నివాసి ఆదోజు శ్రీనివాస చారి, బొల్లంపల్లి బూత్ కమిటీ అధ్యక్షులుగా, వెల్దండ బీజేపీ పార్టీ ఉపాధ్యక్షులుగా, మండల ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు, బీజేపీ పార్టీ పెద్దలు ఆయనను నాగర్ కర్నూలు జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా ఆదోజు శ్రీనివాస చారి పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. జాతీయ బీసీ మాజీ కమిషన్ సభ్యులు తల్లోజ ఆచారి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారి యెండల లక్ష్మీనారాయణ, నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎల్లెని సుధాకర్ రావు కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భారతీయ జనతా పార్టీ నాపై నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యత పెట్టినందుకు పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ పార్టీ సిద్ధాంతాలను అనుసరిస్తూ, పార్టీ పెద్దల అడుగుజాడల్లో నడుస్తానని, క్రమశిక్షణతో బీజేపీ ఆలోచనలకు కంకణ బద్ధులై ఉంటానని, వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ విజయకేతనంలో భాగస్వామ్యంగా ఉంటానని, ప్రతి కార్యకర్తలను కలుస్తూ అంకిత భావంతో పనిచేస్తానని ఆదోజు శ్రీనివాస చారి తెలిపారు.

## గట్టుఇప్పల పల్లి గ్రామంలో జిపిఎల్ సీజన్ 5 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



తలకొండపల్లి, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

తలకొండపల్లి మండలంలోని గట్టుఇప్పల పల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న జిపిఎల్ సీజన్ 5 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసి టోర్నమెంట్ ను ప్రారంభించిన తెలంగాణ రాష్ట్రం ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మండలం బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఏదుల రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డేవిడ్, రేణు రెడ్డి, శెట్టి రాజశేఖర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివ కుమార్ గౌడ్, శరత్ చంద్ర, చొప్పరి శీను, మట్ట అంజయ్య, కానుగుల జంగయ్య, కోల రమేష్, పవన్, మచ్చేందర్, అనంతరాములు, బొర్ర కృష్ణయ్య, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సైన్స్ ఫేయిర్ కు ఎంపికైన నివేదిత విద్యార్థి.



కొత్తకోట, జనవరి 11(నీలగిరి ఎక్స్ ప్రెస్) :

వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణ కేంద్రంలో గల నివేదిత హైస్కూల్ పదవ తరగతి విద్యార్థి జి. మణికంఠ, జడ్చర్ల పోలేపల్లి సెజ్ ఎస్. వి. కె. యం. పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థి మణికంఠ తయారు చేసిన టైమర్ ను మొబైల్ వాడకంలో వుపయోగించడం ద్వారా గంటల తరబడి ఛార్జింగ్ పెట్టడం వలన బ్యాటరీ వెడేక్కడం, పాడైపోకుండా వుంటుందని, ఎలక్ట్రిక్ వాహనాల చార్జీంగ్ కూడా ఉపయోగించవచ్చని వివరించాడు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా నుండి జాతీయ స్థాయికి ఎంపిక్కెన నివేదిత హైస్కూల్ పదవ తరగతి విద్యార్థి జి. మణికంఠ సైన్స్ ఉపాధ్యాయులను పాఠశాల కరస్పాండెంట్ ఆకుల లక్ష్మి, యాజమాన్య బృందం ప్రిన్సిపాల్ సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

## ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు



ఆమనగల్లు, జనవరి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

ఈరోజు స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఆమనగల్ మండలంలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేశ స్వాతంత్రం కోసం ముఖ్యపాత్ర పోషించిన వడ్డే ఓబన్న జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా జరపాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు గండికోట మల్లేష్, గండికోట శంకర్, వరికుప్పల రాజు, దేరంగుల వెంకటేష్, వరికుప్పల గణేష్, సంపంగి శ్రీనివాస్, సంపంగి నర్సింహా, కిట్టు, వరికుప్పల శ్రీనివాస్, వరికుప్పల లక్ష్మయ్య, దేరంగుల పెద్దయ్య, మంగళపల్లి శ్రీనివాస్, వరికుప్పల రాఘవేందర్, వరికుప్పల నిరంజన్, వరికుప్పల అశోక్, రామకృష్ణ, ఓర్సు వెంకటేష్, ఓర్సు తిరుపతి, దేరంగుల మురళి మోహన్, చిన్న రాము, శివరామ్, రేపని శివ, వరికుప్పల శ్రీను, రాజు, బాలు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ వ్యవస్థ పై ప్రజలకి అవగాహన కల్పించాలి

### - ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఆమనగల్లు, జనవరి 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

సేవలను బట్టే కీర్తి లభిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. న్యాయవాదులు చట్టాలు, న్యాయ వ్యవస్థ పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. యాదిలాల్, టీడీపీ రాష్ట్ర వాణిజ్య సెల్ కార్యదర్శి కండె సత్యం,అమనగల్లు మాజీ మార్కెట్ చైర్మన్ బట్టు కిషన్ రెడ్డి, ఎండపల్లి నారాయణ, మాజీ జెడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు తిప్పిరెడ్డి నారాయణరెడ్డి, సూదిని కొండల్ రెడ్డి, సీనియర్ పాత్రికేయుడు సత్యనారాయణ లతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వాటిని ఆవిష్కరించారు. ప్రతి ఏటా డైరీ, క్యాలెండర్ ను రూపొందించి ప్రజలకు అందిస్తున్న యాదిలాల్ ను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ప్రజా చైతన్య కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు తమ వంతు పాలుపంచుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాజుల పద్మనాభం, వెంకోబా, రాజిరెడ్డి, సురేందర్ రెడ్డి, సీత పెద్దయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు సాయం చేయడం అంటే దేశ సౌభాగ్యానికి సహకారం అందించడం

### -ఎలుకలు ఉన్నాయని ఇల్లు తగలబెట్టినట్లు కాంగ్రెస్ పరిపాలన సాగుతుంది

### -మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



వనపర్తి, జనవరి 11(నీలగిరి ఎక్స్ ప్రెస్) :

రైతుకు సహాయం చేయడంఅంటే దేశ సౌభాగ్యానికి సహాయం చేసినట్టే అని, అనహర్వులకు రైతుబంధు ఇచ్చారని రైతులపై అక్కాస్ వెళ్ళబోస్తున్న కాంగ్రెస్ రైతు బందుపై వారు మాట్లాడే తీరు ఇంట్లో ఎలుకలు ఉన్నాయని ఇల్లంతా తగలబెట్టినట్లు ఉందని ఆయన ఎద్దే వచ్చేశారు. శనివారం హైదరాబాద్ తెలంగాణ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో నిరంజన్ రెడ్డి మాట్లాడుతూరైతుకు సాయం ఆ కుటుంబానికి సాయం కాదు, దేశానికి సాయం బీఆర్ఎస్ పాలనలో 11 విడతల్లో 73 వేల కోట్లు రైతులకు అందించాం రైతుబంధు 25 వేల కోట్లు వృథా అని ఆరోపించి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశారు మరి ఏడాదిలో ఆ ఉపసంఘం ఏం తేల్చింది? సీఎం స్వగ్రామంలో అనర్హులకు రైతుబంధు అందిందని నిరూపిస్తారా?ఉప ముఖ్యమంత్రి స్వగ్రామంలో అనర్హులకు రైతుబంధు అందిందని నిరూపిస్తారా? ప్రభుత్వం వద్ద అన్ని లెక్కలు ఉన్నాయి. మరి ఎందుకు బయట పెట్టడం లేదు? ఎలుకలున్నాయని ఇల్లు తగలబెడతారా? రైతుభరోసా అమలు చేయడం చేతగాక రైతుల మీద నిందలు వేస్తున్నారు అన్నం పెట్టే రైతు యాచించే స్థితిలో ఉండొద్దని దేశానికే ఆదర్శంగా నిలిచే పథకాన్ని కేసీఆర్ గారు ప్రవేశపెట్టారు

తెలంగాణలో వ్యవసాయాన్ని ఒక పథకం ప్రకారం దెబ్బతీసే కుట్ర జరుగుతోంది మొన్నటి దాకా గుట్టలు, రాళ్లు, డిజిటల్ సర్వే, ఐటీ అంటూ చెప్పి ఇప్పుడు అందరికీ ఇస్తామని చెబుతూ కలెక్టర్ల సమావేశం పెట్టి భారం వారి మీద నెట్టారు పంటలు పండిస్తేనే రైతుభరోసా ఇస్తాం అంటున్నారు సాగునీళ్లు ఇస్తేనే భూములు సాగవుతాయి. సాగునీళ్లే ఇవ్వకపోతే పంటలు ఎక్కడ పండుతాయి? పంటలు లేకుంటే బోనస్ ఎక్కడిది? మద్దతు ధర ఎక్కడిది? భూమిని నమ్ముకుని కష్టపడే రైతులకు భరోసా ఇచ్చేందుకు ఇన్ని అవాంతరాలు పెడుతున్నారు కోటి 57 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడిలో ప్రభుత్వం కేవలం 47 లక్షల మెట్రిక్ టన్నులే సేకరించింది ఆ సేకరణలో సన్నవడ్లు కేవలం 16 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే, దానికి కూడా పూర్తి బోనస్ ఇవ్వలేదు పంచ పాండవులే మంచం కోళ్ల వలె ముచ్చటగా ముగ్గురు అన్నట్లు, కాంగ్రెస్ పార్టీ పథకాల అమలు తీరు ఉంది వందేళ్ల పార్టీ అయిన కాంగ్రెస్ సీనియర్ నేతలు, 'మాకు తెలియదా?' అని మీరే అన్నారని, ఇప్పుడు పథకాలు అమలు చేయమంటే కేసీఆర్ సర్కార్ మీద నెపం నెడుతున్నారు ప్రశ్నిస్తే, నిలదీస్తే కేసులు పెట్టి బెదిరిస్తున్నారు ప్రజల అవసరాలు ఏమిటి? వనరులను ఎలా వినియోగించాలి అన్న ఆలోచన లేకుండా, అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చి అమలు చేయకపోవడం దారుణం ఈ ఏడాది రాష్ట్రంలో అత్యధిక వర్షపాతం నమోదైంది అయినా సాగునీళ్లను వాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది బీఆర్ఎస్ ప్రభుత్వం సాగునీళ్లు, కరెంటు ఇచ్చినప్పుడు, కాంగ్రెస్ ఎందుకు ఇవ్వలేకపోయింది? రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వంలో ఎవరికీ పట్టింపులేదు రాష్ట్రంలో ఎక్కడా కరెంట్ సరఫరా సరిగ్గా లేదు, వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది

సాగునీళ్లు లేవన్న సాకుతో రైతులకు రైతుభరోసా ఇవ్వకుండా ఎగ్గొడితే ఊరుకోం వ్యవసాయ రంగాన్ని కాపాడిన ఘనత కేసీఆర్ గారిదే ఎండాకాలంలో మత్తళ్లు దుంకించిన చరిత్ర కేసీఆర్ గారిది, భారీ వర్షాలు కురిసినా సాగునీళ్లు ఇవ్వలేని చరిత్ర కాంగ్రెస్ పార్టీది రైతులకు ఎగ్గొట్టిన రైతుభరోసా రూ. 17,500 చెల్లించాలి రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలి కేంద్రంలోని ఎన్డీఏ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు కలసి కోఆపరేటివ్ ఫెడరలిజం కొనసాగిస్తున్నాయి కేటీఆర్ మీద పెట్టిన కేసు విషయంలో ఈడీ కేసు దాఖలు చేయడం దానికి నిదర్శనం కాంగ్రెస్, బీజేపీ కలిసి బీఆర్ఎస్‌ను బలహీనపరచడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయి తెలంగాణ ప్రయోజనాలను కాపాడేది కేవలం బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ మాత్రమే అని ఆయన అన్నారు.

# సంక్షేమ పథకాల అమలులో తారతమ్యాలు లేకుండా లబ్ధిదారుల ఎంపిక

### - మంత్రి శ్రీధర్ బాబు





రంగారెడ్డి, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి తారతమ్యాలు లేకుండా అర్హులైన ప్రతిఒక్క పేద వారికి లబ్ధిచేకూరే విధంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల వంటి సంక్షేమ పథకాల అమలుపై ఏర్పాటు చేసిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అవగాహన సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రీ శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సంక్షేమ పథకాల అమలులో అన్ని నియోజకవర్గాలు, జనవరి 26 నుంచి అమలు చేసే పథకాలు, మరియు రాబోయే ఉగాది నుండి సన్నబియ్యం పంపిణీ ప్రణాళికపై వివరించారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, పథకాల అమలు షెడ్యూలు, లబ్ధిదారుల ఎంపిక విధానం, రైతు భరోసా క్షేత్రస్థాయి పరిశీలనలు, మరియు అర్హుల ఎంపిక విధానం గురించి మాట్లాడారు. సభలో చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ బొగారపు దయానంద్, శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, కాలే యాదయ్య, అరికె పూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, వీర్లపల్లి శంకర్, ఫ్లాగ్ షిప్ ప్రాజెక్ట్స్ కమీషనర్ కె.శశంక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు, వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చెట్టు = అమ్మ, చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**

-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.

-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.

-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**

-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.

-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.

చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"

మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# అభివృద్ధి పథాన జానంపేట వెంకటేశ్వర స్వామి దేవాలయం

-షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

- వైకుంఠ ఏకాదశి పర్వదినం విజయవంతం

-సహకరించిన భక్తులకు కృతజ్ఞతలు

- పోలీసు, మున్సిపల్, దేవదాయ శాఖలకు ప్రత్యేక ధన్యవాదాలు

-దర్శనాల కోసం షాద్ నగర్ ప్రాంతంతోపాటు చేవెళ్ల, శంకరపల్లి, షాబాద్ తదితర ప్రాంతాల నుండి భక్తుల రాకపై సంతృప్తి




**షాద్ నగర్, జనవరి 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనాల కోసం వేలదిగా వచ్చిన భక్తులతో జానంపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం కిటకిట లాడుతూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా సుమారు యాభై వేల మంది భక్తులు తరలి వచ్చారని సహకరించిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు అని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు మాట్లాడుతూ.. కనివిని ఎరుగని రీతిలో మొదటిసారి అరకోటికి పైగా జనాలు స్వామివారి దర్శనం కోసం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి తరలిరావడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి ప్రతినిత్యం జరుగుతూనే ఉందని ఆలయ ప్రాంగణంలో వివిధ దేవాలయాలు పరిసరాలు అన్ని ఆధ్యాత్మిక శోభను అలరించే విధంగా అభివృద్ధి పదాన నిలుస్తూ ఉండడం దీనికి నిదర్శనమని ఆయన అన్నారు. తెల్లవారు జాము నాలుగు గంటల నుంచి స్వామి వారి దర్శనానికి భక్తులను అనుమతించామని, రాత్రి పదిగంటలు దాటేవరకు కూడా భక్తులు వేలాదిగా తరలివచ్చారని తెలిపారు. షాద్ నగర్ నియోజకవర్గంలోని అన్ని మండలాలతోపాటు అదేవిధంగా చేవెళ్ల శంకర్పల్లి షాబాద్ తదితర ప్రాంతాల నుండి కూడా పెద్ద ఎత్తున భక్తులు ఈ ఆలయానికి తరలిరావడం ఎంతో శుభ పరిణామం అన్నారు. పలువురు ప్రముఖులు సైతం శ్రీవారిని దర్శించుకున్నారని వీఐపీల భద్రత సామాన్య భక్తుల భద్రత అదేవిధంగా ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడికి భద్రత కల్పించిన పోలీసు శాఖ సేవలు ఎంతో గొప్ప వని అన్నారు. అదేవిధంగా దేవాదాయశాఖ మున్సిపల్ శాఖల పనితీరుతో ఆలయ శోభ ఎంతో గొప్పగా తీర్చిదిద్దబడిందని అన్నారు. భక్తులకు ఆకుల వెంకటేశం గుప్తా అరుణ దంపతులు తన కుమారుడు రాఘవేంద్ర గుప్తా స్మారకార్థం అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు కూడా చేపట్టడం, పట్టణ ప్రముఖులు పలుబట్ల బాలరాజు భక్తులకు వెండి గోవింద నామాల అష్టోత్తర పత్రాలు ఉచితంగా పంపిణీ చేయడం వైకుంఠ ఏకాదశి ప్రత్యేకతను సంతరించుకుందని అన్నారు. వైకుంఠ ఏకాదశి నిర్వహణలో అక్కడక్కడ కొన్ని లోపాలు కనిపించినప్పటికీ భక్తుల నుండి వస్తున్న ఫిర్యాదులు స్వీకరించి అప్పటికప్పుడు వాటిని మార్చుకోవడం జరిగిందని తెలిపారు. ఏవైనా పొరపాట్లు జరిగితే వాటిని సమీక్షించుకొని మళ్లీ అలాంటి జరగకుండా కూడా చర్యలు భవిష్యత్తులో చేపట్టడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే బక్కని అన్నారు. మొదటి నుండి ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రముఖులు భక్తులు పాలకులు అందరూ సహకరించడం వల్లే వేలాదిగా భక్తులు తరలివస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు ఏవైనా ఎమ్మెల్యేలు ఎవరు ఉన్న అందరూ ఆలయ అభివృద్ధి కోసం కలిసికట్టుగా సహకరించడం సంతృప్తిని ఇస్తుందని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ మంత్రి శంకర్రావు, ప్రతాప్ రెడ్డి, అంజయ్య యాదవ్ ఎవరు ఎమ్మెల్యేలుగా ఉన్న ఆలయ అభివృద్ధి విషయంలో ఎంతో సహకరించారని బక్కని నర్సింహులు గుర్తుచేసుకున్నారు. ఆలయంలో మహాద్వారా శిఖరం, 18 ఫీట్ల మహాద్వారం అష్టలక్ష్మి విగ్రహాల నిర్మాణం అదేవిధంగా అనేక దేవాలయాలు పునర్నిర్మాణం చేపట్టి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన వేళ భక్తుల తాకిడి ఎక్కువైందని అన్నారు. ఎంతోమంది మరో తిరుపతిగా ఇక్కడి వాతావరణం కీర్తించడం తనకు సంతృప్తిని ఇచ్చిందని భక్కని నరసింహులు అన్నారు. మేడం బాగా పట్టాచార్య వారి సూచన సలహాలతో ఈ ఆలయాన్ని గతం నుండి ఇప్పటివరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని గుర్తు చేసుకున్నారు. భిన్నమైన విగ్రహాల ను తొలగించి పున ప్రతిష్ట చేయడం జరిగిందన్నారు. ఆలయంలో అభివృద్ధి నిత్యం ఎప్పటికప్పుడు సమీక్షించుకుని జరుగుతుందని తెలిపారు. సహకరించిన భక్తులకు ప్రభుత్వ శాఖలకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఆలయ నిర్వాహకులకు వేద పండితులకు అందరికీ బక్కని నరసింహులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో పట్టణ ప్రముఖులు పలబట్ల బాలరాజు, కిషన్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఒగ్గు కిషోర్, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

## సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి చేనేత సంఘం పాలాభిషేకం



**ఆమనగల్లు, జనవరి 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికులకు 168 కోట్లతో అభయ హస్తము పతకాలను, నేతన్న పొదుపు కింద 115 కోట్లు మంజూరు చేసింది. చేనేత కార్మికులు తమ జీతం 8 శాతం పొదుపు చేస్తే ప్రభుత్వం 16 శాతం జమచేసింది. ఈ జీవో ఇచ్చినందుకు తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆమనగల్ చేనేత సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. చేనేత కార్మికులు చాలా దినస్థితిలో ఉన్న సమయంలో ఇలాంటి పథకాలను ప్రవేశపెట్టడం ఆనందదాయకమని, నేతన్న భీమా, నేతన్న భరోసా వంటి పథకాలు చేనేత కార్మికులకు ఆనందం కలిగిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గాజుల శ్రీనివాస్, ఐఎన్టీయూసి కార్మిక విభాగం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎంగలి ప్రసాద్, మండల అధ్యక్షులు జగన్, మున్సిపాలిటీ అధ్యక్షులు మానయ్య, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, ఆమనగల్ పద్మశాలి సంఘం అధ్యక్షులు ఎంగలి బాలకృష్ణయ్య, చేనేత కార్మికులు పురుషోత్తం, మస్న సత్యనారాయణ, వనం యాదయ్య, బి సత్తయ్య, రంగయ్య, లష్మినారాయణ, వెంకటేష్, చంద్రశేఖర్, చక్రపాణి, సత్యం, అనిత, విజయ్, మాజీ మండల అధ్యక్షులు రాములు, అవ్వారి శివలింగం, శ్రీనివాస్ రెడ్డి, కరీం, సోషల్ మీడియా ఇంచార్జ్ నాసర్, రామకృష్ణ, మహేష్, గుర్రం భద్రయ్య, సురేష్, శంకర్, ధోని, చేకు రవి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసులు కుటుంబానికి సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ చేయూత

**వెల్దండ, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



: వెల్దండ మండల కేంద్రానికి చెందిన బసమోని శ్రీనివాసులు ఇటీవల మృతి చెందడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఐదు వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొయ్యల పుల్లయ్య, ఎండి హమీద్, సిమ్ముల తిరుపతిరెడ్డి, కొండిగారి శ్రీనివాసులు, మారేపల్లి శీను, తుంగ శీను తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలకు పుట్టినిల్లు పల్లెటూళ్ళు

-షాద్ నగర్ బీఆర్ఎస్ యువనేత వై. రవీందర్ యాదవ్

- తొమ్మిది రేకుల ప్రీమియర్ లీగ్ ను ప్రారంభించిన యువ నేత రవి

-యువతకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన యువనేత రవీ




**షాద్ నగర్, జనవరి 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

క్రీడలకు పుట్టినిల్లు పల్లెటూర్లు అని ఏ క్రీడ మొదలైన ముందుగా పల్లెటూర్లలోనే పుడుతుందని షాద్ నగర్ బీఆర్ఎస్ యువనేత, మాజీ ఎంపీపీ వై. రవీందర్ యాదవ్ అన్నారు. కేశంపేట మండలం తొమ్మిది రేకుల గ్రామంలో క్రికెట్ టోర్నమెంటును బీఆర్ఎస్ యువనాయకులు వై. రవీందర్ యాదవ్ లంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మ్యాచ్ కు ముందు రవీందర్ యాదవ్ బ్యాటింగ్ చేస్తూ క్రీడాకారులను ఉత్తేజపరిచారు. అనంతరం మాట్లాడుతూ.. పల్లెటూర్లలో యువత సంక్రాంతి సందర్భంగా చేసే కోలాహలం గురించి చెప్పడం వర్ణతీతం అని అన్నారు. క్రీడలు స్నేహపూర్వకంగా ఆడుతూ గత స్మృతులను నెమరు వేసుకుంటూ పండగ వాతావరణాన్ని సృష్టించడం జరుగుతుందని, అదేవిధంగా స్నేహభావాన్ని పెంపొందించి దేహదారుడ్యానికి ఎంతో ఉపయోగపడేలా టోర్నమెంటులు యువత చేపట్టడం అభినందనీయమని అన్నారు. యువతకు తన వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా సంక్రాంతి శుభాకాంక్షలు అందరికీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్, మాజీ జడ్పీటీసీ నర్సింగరావు మాజీ సర్పంచులు సావిత్రి బాలరాజు, నవీన్ కుమార్, శ్రీనివాస్ మాజీ ఎంపీటీసీ యాదయ్య, నాయకులు భూపాల్ రెడ్డి, ప్రేమ్ కుమార్ గౌడ్, జమాల్ ఖాన్, సాజిద్, జగన్మోహన్, గణేష్ గౌడ్, వెంకటేష్ మరియు ఆర్గనైజింగ్ టీం సభ్యులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**కడ్తాల్,జనవరి 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కడ్తాల పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. దీనికి సంబంధించి కడ్తాల్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్ తెలిపిన విరాలు ఇలా ఉన్నాయి. మైసిగండి ఆలయ సమీపంలో ఎం.ఆర్.జి గార్డెన్ ఎదురుగా హైదరాబాదు నుండి మాడుగుల మండలానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బావాజీ వెంకటయ్య (45), బావాజీ భీమయ్య (46) శివ ఇర్విన్ గ్రామానికి చెందిన వీరు.. ద్విచక్ర వాహనం వెనకాల నుండి ఒక స్కార్పియో వాహనం ఢీ కొట్టింది బైక్ పై ఉన్న వెంకటయ్య అక్కడికక్కడే మృతిచెందాడు, భీమయ్య, శివ ను వెల్దండ మండలంలోని యెన్నం హాస్పిటల్ కి




తరలించగా చికిత్స పొందుతూ భీమయ్య మృతి చెందినట్లు సీఐ తెలిపారు. శివ కాలు విరిగింది. స్కార్పియో వాహనము బైక్ ను ఢీ కొట్టి ఎదురుగా వస్తున్న మైసిగండి నుండి హైదరాబాద్ వెళ్తున్న కూరగాయల బొలేరో వెనకాల టైర్ కి ఢీకొట్టడంతో బొలెరో వాహనం బోల్తా పడింది. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ మెరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్స్పెక్టర్ శివప్రసాద్ తెలిపారు.

## గాంధీ మనవడు తుషార్ గాంధీని సన్మానించిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ,రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి



**అచ్చంపేట, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అచ్చంపేట పట్టణానికి పాదయాత్రగా విచ్చేసిన విశ్రాంత డీఈవో విజయ్ కుమార్ బృందానికి సంఘీభావంగా మహాత్మా గాంధీ మనవడు తుషార్ గాంధీ, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీయన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. పాదయాత్రలో పాల్గొన్న వారు మార్గమధ్యలో గాంధీ విగ్రహానికి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాస్, గోపాల్ రెడ్డి, అనంతరెడ్డి, నరసింహ రాజ్, కుంద మల్లికార్జున్, హరి నారాయణ గౌడ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బంజర తండాలో కాంగ్రేస్ పార్టీ జెండావిష్కరణ



**మహబూబాబాద్,జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కురవి మండలం బంజర తండాలో కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బాణోత్ బిల్యా నాయక్ అధ్యక్షతన మండల పార్టీ అధ్యక్షులు అంబటి వీరభద్రం నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీ బంజర తండాలో పార్టీ జెండా ఆవిష్కరించి ప్రజలకు అభినందనలు తెలియజేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రేస్ పార్టీ రైతు పక్షపాత ప్రభుత్వమని,పేదల ప్రభుత్వమని,రానున్న రోజుల్లో అభివృద్ధి, సంక్షేమం శరవేగంగా ఉంటుందని,ప్రజలందరూ కాంగ్రేస్ పార్టీ కి అండగా ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు బలగాని శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి అవిరే మోహన్ రావు,జిల్లా నాయకులు బండి శ్రీనివాస్,బండి లక్ష్మారెడ్డి,ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రజినీకాంత్, అయ్యగారిపల్లి గ్రామ అధ్యక్షుడు దొంగల జనార్ధన్ రెడ్డి,కందికొండ గ్రామ అధ్యక్షుడు దువ్వ సైదులు,సీనియర్ నాయకులు ముత్తిలింగం, వెంకన్న,జక్కుల నాగన్న,యూత్ ఉపాధ్యక్షుడు దయ్యాల శ్రీధర్,పొన్నబోయిన లక్ష్మినారి,నూకల నాగన్న,సుఖేందర్ రెడ్డి,సిలివేరు ఉపేందర్,మలోత్ భద్రు,లావుడ్యా నాగార్జున, బాదావత్ బీమా,బాణోత్ రాములు,అంగోత్ రెడ్యా,మలోత్ వెంకన్న,మంగిలాల్ ,నెహ్రు,దచిన్న, నంద,రమేష్,మలోత్ హిరానీ ,సోని,ఇస్లావత్ లక్ష్మీ,అంజ, బూబా,బాణోత్ హుస్సేని తదితరులు పాల్గొన్నారు.

## ఎలుక శ్రీను కుటుంబానికి జూపల్లి భాస్కరరావు చేయూత



**చారకొండ, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చారకొండ మండల పరిధిలోని జూపల్లి గ్రామంలో ఈరోజు ఎలుక శ్రీను మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న వెల్దండ సింగల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కరరావు, శ్రీను కుటుంబాన్ని పరామర్శించి 10,000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జూపల్లి భాస్కరరావుతో పాటు, యువసేన చారకొండ మండల అధ్యక్షుడు ఎండి సిరాజ్, సత్య హరిచంద్ర ఫౌండేషన్ అధ్యక్షుడు రాములు యాదవ్, వెంకటయ్య యాదవ్, జగపతి, ముస్తఫా, శీను, రామస్వామి, బాలరాజు, నిరంజన్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## నంది అవార్డు గ్రహీత కుంగ్ ఫు మాస్టర్ అహ్మద్ ఖాన్ (బ్రూస్ లీ)

### -షాద్ నగర్ కుంగ్ ఫు మాస్టర్ అహ్మద్ ఖాన్ కి తెలుగు వెలుగు నంది పురస్కారం




**షాద్ నగర్, జనవరి 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు 2025 లో భాగంగా తెలుగు వెలుగు నంది పురస్కారాల మహోత్సవం వేదిక శ్రీ త్యాగరాయ గాన సభ హైదరాబాద్ నందు ఘనంగా జరిగాయి. ఈ క్రమంలో కుంగ్ ఫు మార్షల్ ఆర్ట్స్ రంగంలో విశిష్ట కృషి చేసినందుకు తెలుగు వెలుగు నంది పురస్కారం కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారి సౌజన్యంతో నంది అవార్డును రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ న్యూ పవర్ కుంగ్ ఫు మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ ఎండి అహ్మద్ ఖాన్ (బ్రూస్ లీ) అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ జన్మ ఎతినందుకు ఎంతో కొంత సార్ధకత ఉండాలి ఏదో సాధించాలి తాను కొందరికైనా మార్గదర్శకంగా ఉండాలి అని ఏ కొందరిలోనో ఆ తపన ఉంటుంది. అలాంటి వారే చరిత్రలో నిలిచి పోతారు అని అన్నారు.అటువంటి ఆణిముత్యం లాంటి అతిరథ మహారథులు హేమహేమీలు తమ ప్రతిభ పాటవాలను నలుగురికి పంచుతూ ఎన్నో అద్భుతాలు సృష్టించాలని ఆకాంక్షిస్తూ ఇలాంటి విజయాలను భవిష్యత్తులో మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు.

## వంగూర్ లో ఘనంగా ప్రారంభమైన వాలీబాల్ టోర్నమెంట్



**వంగూర్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వంగూర్ మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కె.వి.ఎన్.రెడ్డి పాల్గొన్నారు. క్రీడాకారులకు శ్రీ గోల్డ్ ఇన్ఫ్రా వెంచర్ ప్రాజెక్టు సీఎండి శ్రీ మీసాల స్వామి టీ షర్టులు పంపిణీ చేసి, తన మానవతా హృదయాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వంగూర్ మండలంలో వాలీబాల్ జిల్లా స్థాయి టోర్నమెంట్ నిర్వహించడం గొప్ప విషయమని, నిర్వాహకులను అభినందించారు. క్రీడాకారులు వాలీబాల్ ఆటలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, గేమ్స్ ను స్పోర్టివ్ గా తీసుకుని ఆడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేశినేని పండిత్ రావు,శ్రీ గోల్డ్ ఇన్ఫ్రా వెంచర్స్ ప్రాజెక్ట్ హెచ్ ఆర్ నాగ శేషు యాదవ్, ఛాలెంజ్ టీం హెడ్ బిపాకుల జంగయ్య, ఛాంపియన్స్ టీం హెడ్ చింతకుంట్ల నిరంజన్, విక్టరీ ఎల్లపుల స్వామి, టైగర్ హెడ్ తిరుపతయ్య, డి జి ఎం ఎస్ మేతరి అనిల్, ఎత్తు పు సైదులు, కాల మల్లేష్, ఏటీఎం దొడ్డి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## వంగూరులో బీటీ రోడ్డు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ, కేవీఎన్ రెడ్డి



**వంగూరు, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజా పాలనలో భాగంగా ఇచ్చిన మాటకు కట్టుబడి బీటీ రోడ్డు మంజూరు చేయించిన డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి నియోజకవర్గ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. వంగూరు మండల ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎల్లప్పుడూ మర్చిపోరని, బీటీ రోడ్డు మంజూరు చేసిన డాక్టర్ వంశీకృష్ణకు, కె.వి.యన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వంగూరు మండల పరిధిలోని సర్వారెడ్డిపల్లి గేటు నుండి వంగూరు గేటు, కొల్లారెడ్డిపల్లి, తిమ్మరాశి పల్లి గేటు వరకు బీటీ రోడ్డుకు శంకుస్థాపన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కె.వి.యన్ రెడ్డి, కల్వకుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేశినేని పండితుల, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీఎల్-5 ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్



**కడ్తాల్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో ఎంపీఎల్-5 ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్ పాల్గొని టోర్నమెంట్ ను ప్రారంభించారు. సంక్రాంతి సందర్భంగా గ్రామీణ యువత క్రీడల పట్ల అవగాహన పెంపొందించుటకు క్రికెట్ టోర్నమెంట్లు ఎంతో ఉపయోగపడతాయని, విద్యార్థులకు క్రీడల పట్ల మంచి అవగాహన పెంపొందుతుందని శ్రీనివాస్ గౌడ్ వివరించారు. క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం సంతోషకరమని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా టోర్నమెంట్ నిర్వాహకులు విద్యావంతంగా టోర్నమెంట్ ను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోహార్ లాల్ కె హిరాసింగ్ నాయక్, మాజీ సర్పంచ్ తులసిరామ్, ఆర్. అమ్రు నాయక్, ఆర్. రాజా, జయ రమేష్, ఆర్. మల్లేష్, కె. చిన్న, ఎస్. సాయి, ఆర్. కళ్యాణ్, క్రీడాకారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మండేలయ స్వామి ఆలయ నిర్మాణానికి రూ. 2 లక్షలు విరాళం అందచేసిన మట్ట వెంకటయ్య



**వెల్దండ, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలో రజకుల ఆరాధ్య దైవము శ్రీ మండేలయ స్వామి నూతన ఆలయ నిర్మాణానికి వెల్దండ సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ రూ. 2 లక్షలు విరాళం ప్రకటించారు. శనివారం శ్రీ మండేలయ స్వామి ఆలయ కమిటీ నిర్వాహకులకు ఆయన ఈ విరాళం అందించారు.
మట్ట వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ, శ్రీ మండేలయ స్వామి ఆలయ నిర్మాణం కోసం అందించిన ఈ సహాయం పట్ల కమిటీ నిర్వాహకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతిరెడ్డి, కొయ్యల పుల్లయ్య, హమీద్, రజకుల సంఘం అధ్యక్షుడు రేవెల్లి రవి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జూపల్లి గ్రామంలో సంక్రాంతి క్రికెట్ పోటీలు ప్రారంభించిన భాస్కర్ రావు



**జూపల్లి, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చారకొండ మండల పరిధిలోని జూపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన క్రికెట్ పోటీలను వెల్దండ సింగల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత పైన దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని, యువత గ్రామాల్లో అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. క్రీడలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి, ఆరోగ్యంగా ఉంచడంలో



దోహదపడతాయని, క్రీడల పట్ల యువత ముందుండాలని భాస్కరరావు సూచించారు. జూపల్లి గ్రామంలో క్రీడాకారులను తయారు చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా క్రీడా పోటీలను స్నేహపూర్వకంగా నిర్వహించుకోవాలని సూచించారు.0 ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ డైరెక్టర్ ముస్తఫా (ముజ్జు బాయ్), వెంకట యాదవ్, బాలరాజ్, సత్య హరిచంద్ర పౌండేషన్ అధ్యక్షులు రాములు యాదవ్, జూపల్లి భాస్కరరావు, యువసేన అధ్యక్షులు ఎండి సిరాజ్, నిర్వాహకులు ప్రశాంత్, తిరుపతి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేటినుంచి పరేడ్ గ్రౌండ్‌లో కైట్ ఫెస్టివల్

## పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి జూపల్లి



**హైదరాబాద్, (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మూడు రోజుల పాటు కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఫెస్టివల్ పోస్టర్‌ను మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు చెందినవారు ఈ ఫెస్టివల్‌లో పాల్గొంటారని తెలిపారు. ఇండోనేషియా, శ్రీలంక, నేపాల్, స్కాట్‌లాండ్, మలేషియా, ఇటలీ, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ సహా మొత్తం 50 దేశాలకు చెందిన దాదాపు 150 మంది ఫ్లయర్స్ కైట్ ఫెస్టివల్‌లో పాల్గొంటారని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఫెస్టివెల్ ఉంటుందన్నారు. గ్రామాల్లో కూడా సంస్కృతి, సంప్రదాయాలు పెంపొందించేలా పెద్ద ఎత్తున ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రాచీన కట్టడాలను, దేవాలయాలను పరిరక్షించాల్సి ఉందన్నారు. తెలంగాణ టూరిజం అందుకు తోడ్పాటును అందిస్తుందన్నారు.

# బీఆర్ఎస్ మహా రైతు ధర్నా వాయిదా



**నల్లగొండ, (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించబోయే బీఆర్ఎస్ మహా రైతు ధర్నా వాయిదా పడింది. సంక్రాంతి పండుగ ప్రయాణాలు, విజయవాడ – హైదరాబాద్ హైవేపై ట్రాఫిక్ రద్దీతో పాటు తదితర కారణాలతో పండుగ తర్వాత మహాధర్నా నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలతోపాటు రైతు రుణమాఫీ, రైతుభరోసా మోసాలపై బీఆర్ఎస్ పార్టీ పోరాటానికి సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇప్పటికే రైతు భరోసా కుదింపుపై ఉమ్మడి నల్గగొండ జిల్లా వ్యాప్తంగా రైతులు కొద్దిరోజులుగా ఆగ్రహంతో రోడ్లపైకి వస్తున్నారు. రైతుల ఆందోళన, ఆవేదనకు మద్దతుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ రంగంలోకి దిగుతున్నారు. ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలన్నీ తూ.చ. తప్పకుండా అమలు చేయాలన్న డిమాండ్‌తో ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు మహాధర్నాకు పిలుపునిచ్చారు. ఈ రైతు మహాధర్నాకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పార్టీ ప్రకటించింది. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో మహాధర్నాకు ఏర్పాట్లు జరుగుతున్నప్పటికీ.. సంక్రాంతి పండుగ రద్దీ, ఇతర కారణాల వల్ల వాయిదా వేశారు.

## జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ,జైపాల్ యాదవ్



**వెల్దండ, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామ పంచాయతీ ఇడమ్మ బండ తండాలో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి డాక్టర్ విజితా రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్య గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై టోర్నమెంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి దశరత్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఐజాక్, అనురాధ, పత్యా నాయక్, మాజీ వైస్ ఎంపీపీలు వెంకటయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీలు జ్యోతి, సలిసీమల నిరంజన్, హనుమంత్ నాయక్, మాజీ సర్పంచులు శేఖర్, అపర్ణ, తిరుమలరావు, అంజయ్య, మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, నరసింహ రాజు నాయక్, వెల్దండ మండల బి ఆర్ ఎస్ యూత్ అధ్యక్షుడు జంగిలి, యాదగిరి, ప్రసాదు, నాగయ్య, అశోక్, రాజు రెడ్డి, కొండల్, ప్రవీణ్, శేఖర్, జంగిలి ఆనంద్, రవికుమార్, గణేష్, సైదులు, నరసింహ, శివ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్‌పై 60 మందికి పైగా లైంగిక వేధింపులు



**తిరువనంతపురం, (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేరళ రాష్ట్రంలో దారుణం జరిగింది. మైనర్ అయిన ఓ క్రీడాకారిణిపై ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 60 మంది లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. గడిచిన ఐదేళ్లల్లో తనపై 60 మందికి పైగా లైంగిక వేధింపులకు పాల్పడ్డారని 18 ఏళ్ల ఆ క్రీడాకారిణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తాను మైనర్‌గా ఉన్నప్పుడే ఇదంతా జరిగిందని తన ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేశారు. లైంగిక వేధింపులకు సంబంధించి మహిళ సమాఖ్య నిర్వహించిన కౌన్సిలింగ్ సెషన్‌లో క్రీడాకారిణి తనకు జరిగిన దారుణాల గురించి వివరించింది. 13 ఏళ్ల ప్రాయంలోనే తనపై అత్యాచారం జరిగిందని యువతి తన ఫిర్యాదులో పేర్కొంది. తన పొరుగింట్లో ఉన్న ఓ వ్యక్తి తనను కొండల ప్రాంతానికి తీసుకెళ్లి ముగ్గురు స్నేహితులతో కలిసి అత్యాచారానికి పాల్పడ్డాడని తెలిపింది. ఆ తర్వాత కోచ్‌లు, క్లాస్?మేట్స్, అథ్లెట్స్?ఎక్కువగా లైంగికంగా వేధించారని వెల్లడించింది. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా పోలీసులు 62 మందిని అనుమానితులుగా గుర్తించారు. వారిలో 40 మందిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. వారిలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బాధితురాలిని కౌన్సిలింగ్‌కు పంపించినట్లు పథనంథిట్ట ఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తు కోసం ఒక ప్రత్యేక బృందాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

# 8నెలలుగా ఫ్రిడ్జ్‌లోనే మహిళ మృతదేహం



**భోపాల్, (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మధ్యప్రదేశ్‌లోని దివాస్‌లో సహజీవనం చేస్తున్న మహిళను చంపేశాడు ఓ వ్యక్తి. అయితే ఆమెకు చెందిన మృతదేహాన్ని ఓ ఫ్రిడ్జ్‌లో గుర్తించారు. సుమారు 8 నెలల నుంచి రిఫ్రిజిరేటర్‌లోనే ఆమె శవం ఉన్నట్లు పోలీసులు చెప్పారు. శుక్రవారం ఓ ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్ నుంచి ఆ మహిళ శవాన్ని వెలికి తీశారు. చీరలో ఉన్న ఆమె చేతుల్ని కట్టేశారు. మెడలో బంగారు ఆభరణాలు ఉన్నాయి. నిందితుడు సంజయ్ పటిదార్ తన ఇంటిని కిరాయి ఇవ్వడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. మృతురాలను పింకీ ప్రజాపతిగా గుర్తించారు. ఆమెను గత ఏడాది జూన్‌లో హత్య చేసి ఉంటారని అంచనా వేస్తున్నారు. నిందితుడు పటిదార్ .. ఉజ్జయిన్ నివాసి. గత అయిదేళ్లతో నుంచి బాధిత మహిళతో అతను లివిన్ రిలేషన్‌లో ఉన్నారు. పెళ్లి చేసుకోవాలని వత్తిడి చేయడం వల్లే.. పటిదార్ ఆ మహిళను చంపి ఉంటారని భావిస్తున్నారు. స్నేహితుడి హెల్ప్ తీసుకుని హత్యకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. ఇంట్లో నుంచి చెడు వాసన రావడంతో.. ఓనర్‌ను పిలిపించారు. అయితే ఓ రూమ్‌ను తెరవగా దాంట్లో ఉన్న ఫ్రిడ్జ్‌లో మహిళ శవాన్ని గుర్తించారు. ఇంటి ఓనర్ ధీరేంద్ర శ్రీవాత్సవ్.. ఇండోర్‌లో ఉంటాడు.

# తెరుకోని ఉత్తరాది రాష్ట్రాలు

## -220కి పైగా విమానాల రాకపోకలకు ఆలస్యం



**న్యూఢిల్లీ, (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉత్తరాది రాష్ట్రాలపై పొగమంచు తీవ్రత కొనసాగుతోంది. ఢిల్లీ సహా సమీప రాష్ట్రాలను దట్టమైన పొగమంచు కమ్మేసింది. మంచు దుప్పటి కారణంగా దృశ్యమానత జీరోకు పడిపోయింది. దీంతో రోడ్డు, రైలు, విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. శనివారం ఉదయం ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ రన్‌వేపై విజిబిలిటీ జీరోగా నమోదైంది. దీంతో ఢిల్లీకి రాకపోకలు సాగించే దాదాపు 220కిపైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఢిల్లీలో ఇవాళ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఢిల్లీతోపాటు నోయిడా, ఫరీదాబాద్, ఘజియాబాద్, గురుగ్రామ్‌లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని స్థానిక వాతావరణ కేంద్రం అంచనా వేసింది. మరోవైపు ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, హర్యానా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనూ దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో వారణాసి, లక్నో, ఆగ్రా, పాట్నా, బరేలీ విమానాశ్రయాల్లో విజిబిలిటీ జీరోకు పడిపోయింది. ఈ కారణంగా ఆయా విమానాశ్రయాల్లో విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా కోల్‌కతాలోని శుభాష్ చంద్రబోష్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దాదాపు 19 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి.

# తండ్రీకొడుకుల ప్రాణం తీసిన సెల్ ఫోన్..



**మహారాష్ట్ర: (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
స్మార్ట్ ఫోన్ ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. తండ్రి స్మార్ట్ ఫోన్ కొనివ్వలేదని కొడుకు ఆత్మహత్యకు పాల్పడగా, కొడుకు లేని జీవితం తనకెందుకు ఆ తండ్రి కూడా బలవన్మరణం చెందిన ఘటన మహారాష్ట్రలో జరిగింది. నాందేడ్ ప్రాంతానికి చెందిన ఓంకార్ 10వ తరగతి చదువుతున్నాడు. 16 ఏళ్ల ఓంకార్ ముగ్గురు అన్నదమ్ముల్లో చివరివాడు. అన్నదమ్ములు ముగ్గురు ఉద్గిర్ లోని హాస్టల్ లో ఉంటూ చదువుకుంటున్నారు. మకర్ సంక్రాంతి సెలవుల కోసం ఓంకార్ స్వగ్రామానికి వచ్చాడు. స్మార్ట్ ఫోన్ కొనివ్వాలని తండ్రిని కోరాడు. ఆన్ లైన్ క్లాసులు, ఇతర విద్యా ప్రయోజనాల కోసం స్మార్ట్ ఫోన్ అవసరమని తండ్రికి చెప్పాడు. అయితే, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆ తండ్రి స్మార్ట్ ఫోన్ కొనివ్వలేకపోయాడు. దాంతో మనస్తాపం చెందిన ఓంకార్ ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తండ్రి అతడి కోసం వెదికాడు. తమ పొలంలోని ఓ చెట్టుకు ఉరివేసుకున్న స్థితిలో ఓంకార్ విగతజీవుడిలా కనిపించాడు. ఆ దృశ్యం చూసి దిగ్భ్రాంతి చెందిన తండ్రి%ా% ఓంకార్ మృతదేహాన్ని కిందికి దింపి, అదే తాడుతో అదే చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు తండ్రీకొడుకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలకు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఒకే కుటుంబంలో ఇద్దరు ఆత్మహత్యలకు పాల్పడడంతో వారి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## బిజినెస్

# ఆపిల్ కీలక నిర్ణయం..
# టిమ్‌కుక్ వేతనం భారీగా పెంపు..



గ్లోబల్ టెక్ దిగ్గజం ఆపిల్ కీలక నిర్ణయం తీసుకున్నది. కంపెనీ సీఈఓ టిమ్ కుక్ వేతనం 18 శాతం పెంచాలని నిర్ణయించింది. కంపెనీ వార్షిక వాటాదారుల సమావేశానికి నెల రోజుల ముందుగా ఆపిల్ బోర్డు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. దీని ప్రకారం 2023లో టిమ్ కుక్ వేతనం 63.2 మిలియన్ డాలర్ల (రూ.544 కోట్లు) నుంచి 2024లో 74.6 మిలియన్ డాలర్ల (రూ.643 కోట్లు)కు పెరిగిందని శుక్రవారం తన వార్షిక ప్రాక్సీ ఫైలింగ్‌లో ఆపిల్ వెల్లడించిందిటిమ్ కుక్ కనీస వేతనం మూడు మిలియన్ల డాలర్లు కాగా, స్టాక్ అవార్డుల ద్వారా 58.1 మిలియన్ డాలర్లు, అదనపు పరిహారం రూపేణా 13.5 మిలియన్ డాలర్లు.. చెల్లిస్తారు. గతేడాది నుంచి టిమ్ కుక్ వార్షిక వేతనం గణనీయంగా పెరిగింది. అంతే కాదు, 2025లో టిమ్ కుక్ వేతన ప్యాకేజీలో ఎటువంటి మార్పులు ఉండబోవని ఆపిల్ తేల్చేసింది. ఇక వచ్చేనెల 25న ఆపిల్ వార్షిక సర్వ సభ్య సమావేశం జరుగనున్నది.

# రూపీ 86.04

### చారిత్రక రికార్డు కనిష్ఠానికి పతనం
### ఒక్కరోజే 18 పైసలు క్షీణత




డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ మరో ఆల్‌టైమ్ కనిష్ఠానికి పడిపోయింది. శుక్రవారం ఒక్కరోజే 18 పైసలు దిగజారి మునుపెన్నడూ లేనివిధంగా 86 మార్కుకు ఎగువన 86.04 స్థాయికి క్షీణించింది. తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు, దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలు, అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడి చమురు ధరలు.. రూపీని కూలదోశాయని ఫారెక్స్ ట్రేడర్లు చెప్తున్నారు. ఈ నెల 20న అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రానుండటంతో అగ్రరాజ్య వ్యాపారానుకూల నిర్ణయాలు పెద్ద ఎత్తున ఉంటాయన్న అంచనాల మధ్య డాలర్లకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగిందని కూడా విశ్లేషిస్తున్నారు. కాగా, గతకొద్ది రోజులుగా క్రమేణా పడిపోతున్న రూపాయి పతనం..
భారతీయ దిగుమతులను మరింత భారం చేస్తుండగా, దేశ ఆర్థిక వ్యవస్థకూ కొత్త చిక్కుల్ని తెచ్చిపెడుతున్నది.

**ఫారెక్స్ రిజర్వులు డౌన్**

ఈ నెల 3తో ముగిసిన వారంలో దేశంలోని ఫారెక్స్ రిజర్వులు మరింతగా క్షీణించాయి. 5.693 బిలియన్ డాలర్లు దిగజారి 634.585 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తాజాగా ప్రకటించింది. అంతకుముందు వారం కూడా 4.112 బిలియన్ డాలర్లు పడిపోయిన విషయం తెలిసిందే. కాగా, గత ఏడాది సెప్టెంబర్ ఆఖర్లో ఆల్‌టైమ్ హైని తాకు తూ ఫారెక్స్ నిల్వలు 704.885 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. కానీ మూడున్నర నెలల్లో 70 బిలియన్ డాలర్లు హరించుకుపోవడం గమనార్హ

# డీ-మార్ట్ సీఈఓగా అన్షుల్ అసవా..
# మార్చి 15 నుంచి అమల్లోకి..




డీ-మార్ట్ రిటైల్ చైన్ నెట్‌వర్క్ సీఈఓగా అన్షుల్ అసవాను నియమిస్తున్నట్లు ఆ సంస్థ మాతృసంస్థ ఎవెన్యూ సూపర్‌మార్ట్స్ తెలిపింది. ప్రస్తుత సీఈఓ కం మేనేజింగ్ డైరెక్టర్ నెవిలే నోరూన్‌హం వచ్చే ఏడాది జనవరిలో వైదొలుగుతారు. ఈ నేపథ్యంలో ఎవెన్యూ సూపర్‌మార్ట్స్ తన డీ-మార్ట్ టాప్ మేనేజ్‌మెంట్‌ను పూర్తిగా పునర్వ్యవస్థీకరించింది. కొత్త సీఈఓగా నియమితులైన అన్షుల్ అసవా ఇప్పటి వరకూ యూనీ లివర్ థాయిలాండ్ కంట్రీ హెడ్‌గానూ, గ్రేటర్ ఆసియాలో హెూంకేర్ బిజినెస్ యూనిట్ జనరల్ మేనేజర్‌గా ఉన్నారు.ప్రస్తుత సీఈఓ నెవిలీ నొరోన్హమ్ తన సర్వీసు పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకోలేదని ఎవెన్యూ సూపర్ మార్ట్స్ తెలిపింది. డీ-మార్ట్ విస్తరణకు ఆయన అసాధారణ సేవలను కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ప్రశంసించారు. కొత్తగా నియమితులైన అన్షుల్ అసవా బాధ్యతలు మార్చి 15 నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రస్తుత సీఈఓ నొరోన్హా రెండు దశాబ్దాలుగా డీ-మార్ట్‌తో అనుబంధం కలిగి ఉన్నారు. ఐదు స్టోర్ల నుంచి 380కి పైగా స్టోర్లను ఏర్పాటు చేయడంలో ఆయన పాత్ర ఎంతో కీలకం. సీఈఓగా బాధ్యతలు చేపట్టేందుకు అన్షుల్ అసవాకు ప్రస్తుత సీఈఓ నెవిల్లే నోరోన్హా పూర్తిగా సహకరిస్తారు.

# సెంచరీతో చెలరేగిన దేవదత్ పడిక్కల్



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) బ్యాటర్ దేవదత్ పడిక్కల్(99 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సలతో 102) సెంచరీతో చెలరేగాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటకు ప్రాతినిథ్యం వహిస్తున్న దేవదత్ పడిక్కల్.. బరోడాతో శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సెంచరీ సాధించాడు. పడిక్కల్ శతకంతో ఈ మ్యాచ్‌లో కర్ణాటక 5 పరుగుల తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన కర్ణాటక నిర్ణీత 50 ఓవర్లో 8 వికెట్లకు 281 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్ సెంచరీకి తోడుగా అనీష్(64 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 52) హాఫ్ సెంచరీతో రాణించాడు. బరోడా బౌలర్లలో రాజ్ లింబాని, అతిత్ షేత్ మూడేసి వికెట్లు తీయగా.. కృనాల్ పాండ్యా, మెరివాలా తలో వికెట్ పడగొట్టారు. అనంతరం బరోడా 49.5 ఓవర్లలో 276 పరుగులకు కుప్పకూలింది. శెశ్వాత్ రావత్(126 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 104) సెంచరీతో.. అతిత్ షేత్(59 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 56) హాఫ్ సెంచరీతో రాణించినా ఫలితం లేకపోయింది. కర్ణాటక బౌలర్లలో వాసుకి కౌశిక్, ప్రసిధ్ కృష్ణ, అభిలాష్ శెట్టి, శ్రేయస్ గోపాల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. సెంచరీతో కర్ణాటక విజయంలో కీలక పాత్ర పోషించిన దేవదత్ పడిక్కల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ దక్కింది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో దేవదత్ పడిక్కల్‌ను ఆర్‌సీబీ అతని కనీస ధర రూ. 2 కోట్లకు కొనుగోలు చేసింది. ముందుగా పడిక్కల్‌ను తీసుకునేందుకు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపలేదు. వేలం చివర్లో మరోసారి అతని పేరును వేలంలో ఉంచగా ఆర్‌సీబీ కనీస ధరకు కొనుగోలు చేసింది. ఆర్‌సీబీతోనే దేవదత్ పడిక్కల్ ప్రొఫెషనల్ కెరీర్ ప్రారంభించిన విషయం తెలిసిందే.

# రెండో పెళ్ళికి సిద్ధమవుతున్న సానియా

### తెలుగు హీరోతో డేటింగ్ చేస్తోందని పుకార్లు



భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా మరోసారి వార్తల్లో నిలిచింది. 14 ఏళ్ల క్రితం పాకిస్థాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్‌తో వివాహ బంధం పడి తర్వాత విడాకులు తీసుకున్న ఈ టెన్నిస్ క్వీన్, ప్రస్తుతం తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతోందని టాలీవుడ్ వర్గాల్లో పుకార్లు షికారు చేస్తున్నాయి. షోయబ్ మాలిక్ మరొక మహిళతో ప్రేమలో ఉన్నారని తెలుసుకున్న సానియా, విడాకులు తీసుకుని ఒంటరిగా జీవించడాన్ని ఎంపిక చేసుకుంది. ఆమె కుమారుడు ఇజాన్‌తో సహా తన వ్యక్తిగత జీవితంలో కొత్త విషయాన్ని వెతుక్కుంటోంది. అయితే, ప్రస్తుతం ఒక తెలుగు స్టార్ హీరోతో సానియా డేటింగ్ చేస్తున్నట్లు పుకార్లు జోరుగా వినిపిస్తున్నాయి. టాలీవుడ్ సర్కిల్స్‌లో ఈ హీరో ఎవరు అనే చర్చ ఎక్కువగా సాగుతోంది. అభిమానులు ఈ సంబంధం పెళ్లికి దారితీయబోతుందని నమ్ముతున్నారు. సానియా ఇంకా ఈ వార్తలపై స్పందించకపోయినా, భవిష్యత్ ప్రణాళికల గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఇక, షోయబ్ మాలిక్ తన రెండో పెళ్లితో ముందుకు సాగాడు. అతను ప్రముఖ పాకిస్థానీ నటి సనా జావేద్‌ను వివాహం చేసుకున్నాడు, ఇది ఆమెకు కూడా రెండో పెళ్లే. సనా జావేద్, షోయబ్ తమ వివాహ బంధంతో కొత్త జీవితాన్ని మొదలు పెట్టగా, సానియా తన కొత్త జీవిత భాగస్వామితో ఒక కొత్త ప్రయాణానికి సిద్ధమవుతోందని సమాచారం. సానియా జీవితంలోని ఈ కొత్త మలుపు ఆమెకు సంతోషం తెచ్చి, అభిమానులకు మరింత ఉత్కంఠ రేకెత్తిస్తోంది. పెళ్లి వార్తలు నిజమా పుకార్లా అనే దానిపై త్వరలో క్లారిటీ రావొచ్చని అందరూ ఆశిస్తున్నారు.

## స్పోర్ట్స్

# ఐదు మ్యాచుల్లో ఏడు వికెట్లు..

### నిలకడగా రానిస్తోన్న పేసర్ ముకేశ్ చౌదరి




విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్ లో పంజాబ్, మహారాష్ట్ర మధ్య తలపడ్డాయి. అయితే వడోదరాలోని కొతంబి స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో సీఎస్కే పేసర్, మూడు హ్యాట్రిక్ సెంచరీలతో జోరు మీదున్న పంజాబ్ బ్యాటర్ ను బోల్తా కొట్టించాడు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో తెగ వైరల్ అవుతోంది. టీమ్‌ఇండియాలో చోటు కోసం ఎదురుచూస్తున్న పంజాబ్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ విజయ్ హజారే ట్రోఫీలో దుమ్మురేపుతున్న సంగతి తెలిసిందే. రీసెంట్ గానే హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రభ్‌సిమ్రన్ (137బీ 105 బంతుల్లో 20 ఫోర్లు, 3 సిక్స్‌లు) శతక్కొట్టాడు. అంతకుముందు గత రెండు మ్యాచ్‌ల్లో.. ముంబయిపై (150లి), సౌరాష్ట్రపై (125) సెంచరీలు బాదాడు. అలా వరుసగా మూడో సెంచరీలతో చెలరేగి ఆడాడు. అయితే ప్రస్తుతం జరుగుతోన్న విజయ్ హజారే ట్రోఫీలో పంజాబ్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ ను బోల్తా కొట్టించాడు చెన్నై సూపర్ కింగ్స్ పేసర్ ముకేశ్ చౌదరి. తన సూపర్ బౌలింగ్ తో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ లో జోరు మీదున్నప్రభ్‌సిమ్రన్ ను ఔట్ చేశాడు. ఈ మ్యాచ్ పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్ నాలుగో ఓవర్ లో అతడు పెవిలియన్ చేరాడు. ముకేశ్ పర్ఫెక్ట్ ఔట్ సింగ్ ను సంధించగా, ప్రభ్‌సిమ్రన్ సింగ్ డ్రైవ్ ఆడబోయి ఔట్ అయ్యాడు. బంతి స్వింగ్ అయి ఆఫ్ స్టంప్ మీదుగా వెళ్లింది. దీంతో ఈ రైట్ హ్యాండ్ బ్యాటర్ కేవలం 17 బంతుల్లో 14 పరుగులకే వెనుదిరిగాడు. ముకేశ్ తీసిన వికెట్ తో మహారాష్ట్ర ప్రభ్‌సిమ్రన్ సింగ్ దాడి నుంచి తప్పించుకుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోనే బీసీసీఐ డొమాస్టిక్ క్రికెట్ తన ఎక్స్ హ్యాండిల్ లో పోస్ట్ చేసింది. ముకేశ్ వేసిన బంతి అదిరింది అంటూ రాసుకొచ్చింది. ముకేశ్ చౌదరి తన ఆరు ఓవర్లలో మూడు వికెట్లు తీశాడు. తన గత ఐదు మ్యాచుల్లో కలిపి ఏడు వికెట్లు దక్కించుకున్నాడు. అంతకుముందు సయ్యద్ ముస్తక్ అలీ ట్రోఫీ టీ20 టోర్నమెంట్ లో మొత్తం 15 వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. కాగా, ఐపీఎల్ మెగా వేలంలో సీఎస్కే ముకేశ్ చౌదరిని రూ.3 కోట్లకు దక్కించుకుంది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ ను పంజాబ్ రూ.4 కోట్లకు కొనుగోలు చేసింది.